వ్యవసాయ శాఖలో ప్రక్షాళన షురూ

- ఆదాయం తెచ్చే కుర్చీలకు భారీ డిమాండ్
- అందరి కళ్లు ఆ కుర్చీలపైనే..

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 30: వ్యవసాయ శాఖలో ప్రక్షాళన త్వరలోనే మొదలవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అయితే కీలకమైన కుర్చీలు దక్కించుకునేందుకు తెలుగుదేశం పార్టీలో ముఖ్య నాయకులను ప్రసన్నం చేసుకోడానికి కొంత మంది వ్యవసాయ శాఖ అధికారులు పరుగులు పెడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వ్యవసాయ శాఖలో ఆదాయం భారీగా వచ్చే కుర్చీల కోసం కొంత మంది వ్యవసాయాధికారులు దృష్టి పెడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొన్ని కీలక స్థానాలు ఒక సామాజిక వర్గానికి చెందిన వారే దక్కించుకున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వ్యవసాయాధికారులకు అంతగా ప్రాధాన్యత లేని ప్రదేశాల్లో పోస్టులు ఇచ్చారని, ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడంతో వారంతా ప్రాధాన్యత కలిగిన ప్రదేశాల్లో పోస్టింగులు ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ముఖ్యంగా కర్నూలు సబ్ డివిజన్‌తో పాటు డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు, ఆత్మకూరు, బనగానపల్లె, తదితర వ్యవసాయ డివిజన్ కేంద్రాల్లోని ఏడీఏ పోస్టులను దక్కించుకునేందుకు కొంత మంది వ్యవసాయాధికారులు తమ ప్రయత్నాలను తీవ్రం చేశారు. అదే విధంగా కర్నూలు, కల్లూరు, కోడుమూరు, నంద్యాల, డోన్ తదితర మండల వ్యవసాయాధికారులుగా పోస్టింగులు దక్కించుకునేందుకు మంత్రుల స్థాయిలో కొంత మంది వ్యవసాయాధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. డీలర్ల నుంచి పెద్ద ఎత్తున ఆదాయం అందడంతో పాటు లైసెన్సులు రెన్యువల్ చేసేందు కోసం శాంపుల్స్ పేరుతో పెద్ద ఎత్తున మామూళ్లను వసూళ్ల చేసే అవకాశం ఉన్న ఈ మండలాల్లో పోస్టింగులు దక్కించుకునేందుకు వారు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.



అవ్వా తాతలకు రెట్టింపు భరోసా!

- పేదల ఇంట పింఛన్ పండుగ
- తొలి రోజే వంద శాతం పంపిణీకి సన్నాహాలు
- జిల్లాలో 2.45 లక్షల మందికి 167.35 కోట్లు
- ఏకకాలంలో భారీ మొత్తం అందజేయనున్న ప్రభుత్వం
- రాష్ట్ర చరిత్రలోనే ఓ రికార్డు

కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

అవ్వాతాతలు, దివ్యాంగులు, వింతతు మహిళలకు సామాజిక భద్రత పింఛన్ల ద్వారా రెట్టింపు భరోసా లభించనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే పింఛన్ రూ.4 వేలకు పెంచారు. అందుకు అదనంగా రూ.3 వేలు బకాయి కలిపి సోమవారం ఎన్టీఆర్ భరోసా పేరిట రూ.7 వేలు ఇంటి వద్దనే నేరుగా అందజేసేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్లు పంపిణీ చేసేందుకు వీలుగా ఆయా సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి శనివారం రూ.167.35 కోట్లు డ్రా చేశారు. జిల్లాలో 2.45 లక్షల మంది వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులకు ప్రయోజనం కలగనుంది. కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆదివారం ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పింఛన్ల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పింఛన్ల ఓ పండుగలా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేశారు. పంపిణీలో సచివాలయం, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవో ఆఫీసు జూనియర్ అసిస్టెంట్లు 4,851 మంది సోమవారం ఉదయం 6 గంటలకే వృద్ధుల ఇంటి తలుపుతట్టి సీఎం చంద్రబాబు తీపి కబురు లేఖను ఇచ్చి రూ.7 వేలు అందజేస్తారు. జిల్లాలో పింఛన్ లబ్ధిదారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.



వృద్ధుల ఇంటికి మంత్రులు, ఎమ్మెల్యేలు

ప్రభుత్వం సంక్షేమ పథకం ప్రారంభించాల్సి వస్తే ప్రజాప్రతినిధులు భారీ ఎత్తున సమావేశాలు పెట్టి ఆర్భాటం చేసేవారు. ఉదయమే వృద్ధులు సమావేశం వేదిక వద్ద గంటలు తరబడి నిరీక్షించే పరిస్థితి ఉండేది. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురైన సందర్భాలు ఎన్నో చూశాం. ఇందుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచిన పింఛన్ పంపిణీ ఏర్పాట్లు చేయించారు. ఎక్కడ కూడా సభలు, సమావేశాలు లేకుండా వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని, అవ్వా తాతలకు ఎలాంటి ఇబ్బందులను గురి చేయవద్దని ఇప్పటికే ఎమ్మెల్యేలు, మంత్రులను ఆదేశించారు. దీంతో జిల్లాలో ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గౌరు చరిత, డాక్టర్ పార్థసారథిలు సచివాలయ సిబ్బందితో పాటు పింఛన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డిలు కర్నూలు నగరం బిర్లా గడ్డ వద్ద అవ్వా తాతల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేసి చంద్రబాబు సందేశం లేఖ అందజేస్తారు. ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నాయకుడు, ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసి అభ్యర్థి బి.వీరభద్రగౌడ్, మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు, ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి సహా ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు వృద్ధుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని, అదే క్రమంలో సచివాలయ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కల్పించవద్దని పార్టీ అధిష్టానం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. పింఛన్ పంపిణీ తరువాత వృద్ధులతో కలిసి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపే కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంది.

నియోజకవర్గాల వారిగా పింఛన్ లబ్ధిదారులు, పంపిణీ చేసే మొత్తం సుమారుగా రూ.కోట్లలో

నియోజకవర్గం	లబ్ధిదారులు	పింఛన్ మొత్తం
ఆదోని	29,002	19.40
ఆలూరు	35,166	24.35
కోడుమూరు	32,268	22.35
కర్నూలు	33,642	24.25
మంత్రాలయం	29,612	19.50
పాణ్యం	16,181	11.25
పత్తికొండ	34,154	23.00
ఎమ్మిగనూరు	34,746	23.25
మొత్తం	2,45,229	167.35

పింఛన్ల పంపిణీలో భాగస్వాములు కండి

టీడీపీ శ్రేణులకు తిక్కారెడ్డి పిలుపు



కర్నూలు(అర్బన్), జూన్ 30: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన సామాజిక పింఛన్ల పెంపు హామీ అమలు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈనెల పింఛన్ల పంపిణీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ. 3 వేల నుంచి రూ 4 వేల వరకు పెంచారని అన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం, బూత్ స్థాయి నాయకులందరూ లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పింఛన్ అందజేయాల్సిన అవసరం ఉందన్నారు.

వంద శాతం పూర్తి చేయాలి



పింఛన్లు పంపిణీ చేసే సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటలకే వృద్ధుల ఇళ్లకు చేరుకుంటారు. ఒక్కొక్కరికి రూ.7వేలు పంపిణీ చేసి వారి నుంచి రసీదు తీసుకుంటారు. అదే సమయంలో లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు సందేశం లేఖను అందజేస్తారు. తొలి రోజే వంద శాతం పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎక్కడ కూడా ఇబ్బందులు రాకుండా ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చాం. అదే క్రమంలో మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తారు. ఆ మేరకు టెలికాన్ఫరెన్స్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

- పి.రంజిత్‌బాషా, కలెక్టర్



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, జూన్ 30: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. ఆదివారం వేకువ జాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందకు క్యూలైన్లలో భక్తులుబారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్టనందు స్వామివారికి తలనీలాలు సమర్పించి, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర ప్రధాన వీధులు కిక్కిరిసిన కనిపించాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన భవనంలో అన్నప్రసాద వితరణ చేశారు. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు రద్దీగా కనిపించాయి.



డీసీసీ పీఠం కోసం పైరవీలు

పోటీలో పలువురు



కర్నూలు(అర్బన్), జూన్ 30: డీసీసీ (జిల్లా కాంగ్రెస్ కమిటీ) పీఠం కోసం పైరవీలు జోరందు కున్నాయి. రెండు రోజుల్లో కొత్త కమిటీ కూర్పు జరగబో తోందనే ప్రచారం జరుగు తోంది. గత వారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని అన్ని కమిటీలను రద్దు చేసిన విషయం తెలిసిందే. డీసీసీ పీఠం కోసం ప్రస్తుత డీసీసీతోపాటు ఎంపీ, ఎమ్మెల్యే, అభ్యర్థులు, కొందరు నాయకులు పోటీ పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి వైఎస్ షర్మిల కాస్త జోష్ తెచ్చారు. ఇదే క్రమంలో వైసీపీలోని అసంతృప్తులు పార్టీలో చేరడంతో ఆధిపత్య పోరు తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో డీసీసీ పీఠం కోసం డిమాండ్ పెరిగిందనే ప్రచారం సాగుతోంది.

ఎందరో పెద్దలు ఏలిన పీఠం..

1950లో జోర్నాల వెంకటరత్నం శెట్టి మొట్టమొదటి డీసీసీ నియమితులయ్యారు. పెండేకంటి వెంకటసుబ్బయ్య, మద్దూరు సుబ్బారెడ్డి వంటి 16 మంది ఉద్దండులు డీసీసీ అధ్యక్షులుగా పని చేశారు. అదే పీఠం కోసం ఇటీవల వర్గాలుగా వీడిపోయి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వద్ద ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం చర్చనీయాంశమైంది. కేంద్ర, రాష్ట్రాల్లో కీలక పదవుల్లో ఉంటూ దామోదరం సంజీవయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి లాంటి వారు ఎందరో పార్టీని ఏకతాటిపై నడిపించారు. ప్రస్తుతం పని చేస్తున్న నాయకులు అలాంటి వారి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు కూడా లేని పరిస్థితి. అలాంటిది కర్నూలులో సొంత పార్టీ కార్యాలయంతోపాటు అందులో నలుగురు ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇదే కార్యాలయానికి సంబంధించిన రూములకు నెలకు రూ.1.86 లక్షలు అద్దె రూపంలో సమకూరుతోంది. వీటిని రాష్ట్ర పార్టీ కార్యాలయానికి చెందిన ఖాతాలో జమ చేయాలని గతంలోనే పీసీసీ ఆదేశాలు ఉన్నా డీసీసీలు పెడచెవిన పెడుతూ వస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

లెక్కలు పక్కగా ఉన్నాయి

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదాయ, వ్యయాలకు సంబంధించిన లెక్కలన్నీ పక్కాగా ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎవరు వచ్చి అడిగినా చూపించేందుకు సిద్ధంగా ఉన్నాం

. - కే బాబు రావు, డీసీసీ అధ్యక్షుడు

రూటు మార్చిన చిరుత

- మహానంది మాడ వీధుల్లో సంచారం
- పార్వతీపురం సమీపంలో కూడా..
- భయాందోళనలో కాలనీవాసులు



మహానంది మాడవీధుల్లో అర్ధరాత్రి సంచరిస్తున్న చిరుత పులి

మహానంది, జూన్ 30: మహానంది క్షేత్ర పరిసర ప్రాంతంలో రూటు మార్చుకున్న చిరుత ఆదివారం అర్ధరాత్రి మహానంది మాఢ వీధుల్లో సంచరించినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. అలాగే పార్వతీపురం సమీపంలో కూడా తిరిగినట్టు తెలుస్తోంది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల మహానంది గోశాల వైపు రెండు పర్యాయాలు సంచరించిన చిరుత ఆదివారం అర్ధరాత్రి క్షేత్రంలోని మాఢ వీధుల నుంచి దేవస్థానం ప్రధాన కార్యాలయం వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో కనిపించిందని అధికారులు చెబుతున్నారు. ఆదివారం సాయంత్రం మహానంది శివారు ప్రాంతంలోని పార్వతీపురం కాలనీకి అత్యంత సమీపంలో ఉండే నల్లమలలోని దట్టమైన పొదల్లో కనిపించిందని స్థానికులు తెలిపారు. దీంతో నల్లమల్ల సమీప గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ ఉన్నతాధికారులు చిరుతను పట్టుకొని సుదూర ప్రాంతానికి తరలించాలని స్థానికులతోపాటు భక్తులు కోరుతున్నారు.



కనిపించే దేవుళ్లు

- రోగులకు ప్రాణం పోస్తున్న వైద్యులు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్), జూన్ 30 : వైద్యుడు దేవుడితో సమానమని మన నమ్మకం. అత్యవసర సమయాల్లో రోగి బంధువులకు డాక్టర్లే దేవుడిలా కనిపిస్తాడు. వైద్య వృత్తికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు, సమాజంలో గౌరవం ఉన్నాయి. కరోనా మహమ్మారి కరాళనృత్యం చేస్తున్నా వేళ వైద్యులు ఉదయం నుంచి రాత్రి వరకు క్షణం తీరిక లేకుండా రోగుల సేవల్లో నిమగ్నమైపోయారు. రోగికి ప్రమాదకరంగా ఉంటే ఏ సమయంలో అయినా ఆసుపత్రికి చేరుకుని చికిత్స అందించాలనే తపనతో విధులు నిర్వర్తిస్తున్నారు. కొవిడ్ వార్డులో ఐసొలేషన్ వార్డులో పీపీఈ కిట్ వేసుకుని అత్యవసర సేవలు అందించడం తమ ప్రాణాలకు ప్రమాదమైనా చిత్తశుద్ధితో సేవలందిస్తూ కనిపించే దేవుళ్లలా వైద్యులు మారారు. అంతటి విశిష్టమైన వైద్యుల సేవలకు గుర్తింపుగా దేశంలో జూలై 1న ఏటా జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

అత్యవసర రోగుల కోసం



2022 డిసెంబరులో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున 21 ఏళ్ల ఓ రోగిని 108 అంబులెన్సులో క్యాజువాల్టీకి తీసుకవచ్చారు. ఆ సమయంలో అతని తలకు తీవ్రగాయమై పరిస్థితి విషమంగా ఉంది. నోటిలో, ఊపిరితిత్తుల్లో రక్తం చేరడంతో ఊపిరి తీసుకుని పరిస్థితి నెలకొంది. వెంటనే రోగికి సక్షన్ చేసి న్యూరోసర్జరీ వైద్యులకు రెఫర్ చేశాం. త్వరగా వ్యాధిని గుర్తించి న్యూరోసర్జరీ ఆపరేషన్ చేయడంతో రోగి కోలుకున్నాడు.

- డా.సి. క్లింటన్, క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్, కర్నూలు జీజీహెచ్



ప్రాణాలు కాపాడిన సర్జరీ వైద్యులు



తెలంగాణ రాష్ట్రం అమరవాయి గ్రామానికి చెందిన 19 ఏళ్ల మాలిక్‌బాషా డ్రైవర్ ఇసుక లారీ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇసుక లారీ వేగంగా వెళ్తూ చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మాలిక్‌బాషా తొడలోనికి చెట్టుకొమ్మ చొచ్చుకునిపోయింది. మే 8వతేదీన బాధితుడు తీవ్ర రక్తస్రావంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వచ్చాడు. ప్రొఫెసర్ డా. చక్రవర్తి నేతృత్వంలో వైద్యబృందం డా. విజయశంకర్, డా. భాస్కర్ రెడ్డి, డా. అనూష, డా. జగన్మోహన్ రెడ్డి మూడు గంటలు శ్రమించి తొడలోనికి చొచ్చుకునిపోయిన చెట్టుకొమ్మను తొలగించి రోగి ప్రాణాన్ని కాపాడారు. తన 30 ఏళ్ల వైద్య అనుభవంలో ఈ కేసు అత్యంత అరుదైన కేసు అని ప్రొఫెసర్ చక్రవర్తి అన్నారు.

- డా.చక్రవర్తి

ప్రఖ్యాత వైద్యుడు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బిపిన్ చంద్రరాయ్ పుట్టిన రోజునే మన దేశంలో డాక్టర్స్ డేగా జరుపుకుంటున్నారు. ఆయన కలకత్తా మెడికల్ కాలేజీలో వైద్యవిద్య, లండన్‌లో ఉన్నత విద్య అభ్యసించాక 1911లో స్వదేశానికి వచ్చి వైద్యసేవలు ప్రారంభించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలోనూ పాల్గొన్నారు. వైద్యవృత్తిలో విశేష సేవలు అందించిన ఆయన 1882 జూలై 1న జన్మించగా.. 1962 జూలై 1న మరణించారు. వైద్య రంగంలో విశేష సేవలందించినందుకు గాను 1961 కేంద్రం ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డును అందజేసింది.

కొవిడ్‌లో విశేష సేవలు



2021 కొవిడ్ సమయంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంవోగా ఉన్నప్పుడు రోగులకు సేవలు అందించడం ఎంతో సంతృప్తి ఇచ్చింది. నందికొట్కూరు చెందిన 40 ఏళ్ల ఓ మహిళ రోగికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. అర్ధరాత్రి సెంట్రల్ ఆక్సిజన్ ఫ్లో తక్కువగా ఉండటంతో బల్క్ సిలిండర్ కోసం అర్ధరాత్రి జోరుగా వర్షం కురుస్తున్నా సిలిండర్‌ను తీసుకుని వచ్చి రోగికి అమర్చాను. ఇది నా 40 ఏళ్ల వైద్యవృత్తిలో ఎంతో సంతృప్తి ఇచ్చింది.

- డా.వై. ప్రవీణ్ కుమార్, డీఎంహెచ్‌వో

మంత్రి టీజీ భరత్ క్యాంప్ ఆఫీసు సిద్ధం

- తీర్చిదిద్దుతున్న కార్పొరేషన్ సిబ్బంది



కర్నూలు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ క్యాంప్ కార్యాలయం సిద్ధం చేస్తున్నారు. వెంకటరమణ కాలనీలో ఏపీఎస్‌పీ బెటాలియన్ మైదానం ఆనుకొని ఆఫీసు ఏర్పాటు చేశారు. 2014-19 వరకు ఆనాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, 2019-2024 మధ్యలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంగా ఉపయోగించుకున్నారు. అదే కార్యాలయానికి రంగులు వేసి, మరమ్మతులు చేసి మంత్రి టీజీ భరత్ క్యాంప్ ఆఫీసుగా తీర్చిదిద్దారు. 50-60 మందికిపైగా విజిటర్స్ కూర్చోవడానికి వీలుగా పెద్ద హాలు, మంత్రికి ప్రత్యేకంగా ఛాంబరు, మంత్రి వద్ద పని చేసే పీఏ, సిబ్బంది కోసం రెండు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. మంత్రి విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక గది తీర్చిదిద్దారు. క్యాంప్ ఆఫీసు లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏసీలు కూడా అమర్చారు. గతంలో డిప్యూటీ సీఎంగా పని చేసిన కృష్ణమూర్తి, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన బుగ్గన ఈ ఆఫీసుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. మంత్రి టీజీ భరత్ అయినా పూర్తి స్థాయిలో క్యాంప్ కార్యాలయం వినియోగించుకుంటారా..? తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: నంద్యాలలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సెంటనరీ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులంతా హాజరు కావాలని అన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

14న పోస్టల్ ఉద్యోగుల సొసైటీ ఎన్నికలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: కర్నూలు డివిజన్ పోస్టల్ ఉద్యోగుల కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు 14న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ జి. రామక్రిష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 6న ఉపసంహరణ ఉంటుందన్నారు. 14న పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోస్టల్ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పీఆర్ ఇన్‌చార్జి ఎస్ఈగా రామ్మోహన్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈగా నంద్యాల ఈఈగా విధులు నిర్వహిస్తున్న రామ్మోహన్‌ను నియమిస్తూ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఆదోని పీఆర్ ఇన్‌చార్జి ఈఈగా కర్నూలు ఈఈ మద్దన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే కర్నూలు ఎస్ఈ కే సుబ్రమణ్యం, ఆదోని ఈఈ ఏ. వెంకటప్రసాద్ ఆదివారం పదవీ విరమణ పొందారు. దీంతో వీరి స్థానంలో తాత్కాలికంగా ఇన్‌చార్జిలను నియమిస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు.

హోరాహోరీగా గుర్రపు బండ్ల పోటీలు



హోరాహోరీగా సాగుతున్న గుర్రపు బండ్ల పోటీలు

మిడుతూరు, జూన్ 30: మిడుతూరు గ్రామంలో హోరాహోరీగా గుర్రపు బండ్ల పోటీలు జరిగాయి. ఈ పోటీలు మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన సందర్భంగా ఆదివారం కాతా రామచంద్రా రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాత రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 11గుర్రపు బండ్లు పందెంలో పాల్గొన్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా మొదటి బహుమతిగా బళ్లారికి చెందిన ఇమ్రాన్ గుర్రం 25 తులాల వెండి, రెండో బహుమతి మిదు తూరుకు చెందిన ముర్తుజావలి గుర్రం 20 తులాల వెండి, మూడో బహుమతి నందికొట్కూరుకు చెందిన పఠాన్ బాష గుర్రం 15 తులాల వెండి అందించారు. నాలుగో బహుమతి ఆత్మకూరుకు చెందిన ఫరూక్ బాషా గుర్రం 10 తులాల వెండి, ఐదో బహుమతి నంద్యాలకు చెందిన షేక్ హబీబ్ బాషా గుర్రం 5 తులాల వెండి పతకాలు గెలుచుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న వారికి నిర్వాహకులు భోజన వసతి కల్పించారు. పోటీల్లో గెలిపొందిన వారికి కాతా రామచంద్రా రెడ్డి, మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, కాతా రాజ రెడ్డి, కాతా విష్ణు వర్ధన్ రెడ్డి, బన్నూరు హరిసర్వోత్తమ రెడ్డి, యరభం ప్రమోద్ రెడ్డి బహుమతులు అందజేశారు.

అసైన్‌మెంట్ భూమిలో ప్రైవేటు వెంచర్

- సాగు కోసం ఇచ్చిన భూమిలో ప్లాట్ల అమ్మకాలు
- పక్కన ఉన్న పోరంబోకు, వాగు స్థలం ఆక్రమణ ?

పాణ్యం, జూన్ 30: మండలంలోని తమ్మరాజుపల్లెలో అసైన్‌మెంట్ భూమిలో ప్రైవేటు వెంచర్ వేశారు. సాగు కోసం ఇచ్చిన భూమిలో ప్లాట్లు వేసి అమ్మకాలు జరుపుకున్నారు. తమ్మరాజుపల్లెలోని 208-ఏ సర్వే నెంబరులో 2.70 ఎకరాలు, 208-బీ సర్వే నెంబరులో 1.79 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమి కమ్మరి వర్గానికి కేటాయించినట్లు ఆర్ఓఆర్‌లో నమోదైంది. 1998 సెప్టెంబరు 3న 208-బీ1 సర్వే నెంబరులో 89 సెంట్లు, 208-బీ2లో 90 సెంట్లు వడ్డె కృష్ణమూర్తికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా రెవెన్యూ శాఖ డీపట్టా మంజూరైంది. 2004లో నాలుగు రోడ్ల నిర్మాణంలో భాగంగా ఈ భూమిలోని 76 సెంట్లు హైవే నిర్మాణానికి భూ సేకరణ శాఖ స్వాధీనం చేసుకుంది. మిగిలిన 1.03 ఎకరాల్లో రైతు కృష్ణమూర్తి పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఇటీవల ఈ భూమిలో అధికారులకు తెలియకుండానే ప్రైవేటు లేఅవుట్లు వేసి ఇంటి పట్టాల అమ్మకాలు చేపట్టారు. అలాగే ఈ భూమికి పక్కన ఉన్న వాగు పోరంబోకు స్థలం ఆక్రమించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతి లేకుండా ప్లాట్లు వేయడంతో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.



తమ్మరాజుపల్లెలోని 208బీ2 అసైన్‌మెంట్ భూమిలో వేసిన ప్రైవేటు వెంచర్

అసైన్‌మెంట్ భూమిలో ప్లాట్లు వేయరాదు : ఫణికుమార్, తహసీల్దారు, పాణ్యం : అసైన్‌మెంట్ భూమిలో ప్లాట్లు వేయరాదు. అటువంటి భూమికి ల్యాండ్ కన్వర్షన్ చేయడం కుదరదు. వాగు పోరంబోకు, ప్రభుత్వ మిగులు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. తమ్మరాజుపల్లెలోని అసైన్‌మెంట్ భూమిలో ప్లాట్లు వేసినట్లు తమ దృష్టికి వచ్చింది. వెంటనే చర్యలు చేపడతాం.

ఏవీని అరెస్టు చేయాలి

నంద్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏవీ సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలంటూ శ్రీదేవి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, కూతురు రమ్య డిమాండు చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఏవీ సుబ్బారెడ్డి ఇంటి ముందు ఆదివారం వారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏవీ సుబ్బారెడ్డి వల్ల తమకు ప్రాణ హానీ ఉందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి అఖిలప్రియ విజయానికి తమ అమ్మ శ్రీదేవి ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాంటిది ఆమెను చంపిన వ్యక్తుల పట్ల టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీడీపీలో ఉన్నాడనే ఆలోచనతోనే ఆయనను ప్రభుత్వం అరెస్టు చేయకుండా ఆపుతోందని, పార్టీ నుంచి సస్పెండ్ చేయించాలని డిమాండ్ చేశారు. గతంలో తమ చిన్నాన్న మోహన్‌రెడ్డిపై కూడా దాడి జరిపించింది ఏవీ సుబ్బారెడ్డేనని, ఇప్పుడు ఏకంగా తమ అమ్మను చంపించి అమెరికాలో కూర్చున్నాడని అన్నారు. ఏవీని అరెస్టు చేయకపోతే తమను కూడా చంపేస్తాడని, రక్షణ కల్పించాలని కోరారు. కేసును సీబీ సీఐడీకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.



ఏవీ సుబ్బారెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

అకౌంట్స్ సమర్పించకుంటే అనర్హత వేటు

కలెక్టర్ డాక్టర్ కే. శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేసిన మొత్తాలకు తుది అకౌంట్స్‌ను వ్యయ పరిశీలకులకు సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సెంటునరీ హాల్‌లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ఖర్చుపై వ్యయ పరిశీలకులతో కలిసి కలెక్టర్ వివిధ పార్టీల అభ్యర్థులు ఏజెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలను జూలై 3వ తేదీ లోగా తప్పకుండా సమర్పించాలని, లేకపోతే వారిపై అనర్హత వేటు వేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫలితాలు వెల్లడైన 30 రోజులలోపు ప్రతి అభ్యర్థి తమ వ్యయ వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలని, పరిమితికి మించి ఖర్చు చేసినా లెక్కలను సరైన సమయంలో చూపకున్నా అభ్యర్థులపై అనర్హత వేటు పడటంతోపాటు తరువాత ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా కోల్పోతారని తెలిపారు. సమావేశంలో పార్లమెంట్, నియోజక వర్గాల వ్యయపరిశీలకులు, సహాయ అధికారులు, అభ్యర్థులు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక పింఛన్లు



ప్రసంగిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర మంత్రి ఫరూక్ అన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద ఆ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కూడా వారికి రావాల్సిన శాతం మేరకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది రామచంద్రారావు, కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, దివ్యాంగుల సంక్షేమ సంఘం సమన్వయకర్త రమణయ్య, అధ్యక్షుడు సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిపిన దృశ్యం

గూడూరు, జూన్ 30: తిమ్మాపురం అంజనేయస్వామి ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గూడూరు మండలంలోని తిమ్మాపురం చెరువు సమీపంలో పురాతన అంజనేయస్వామి ఆలయం ఉంది. ఇక్కడ ప్రతి శనివారం చెరువు సమీపంలో ఉన్న రైతులు పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం పూజలు చేసేందుకు రైతులు అంజనేయస్వామి ఆలయానికి వెళ్ళారు. ఆలయంలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు జరిపినట్లు వారికి తెలిసింది. ఈ విషయాన్ని రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం గూడూరు పోలీసులు ఆలయానికి వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తిమ్మాపురం జయన్న, లక్ష్మన్న, శేఖర్, హనుమంతు, నాగేష్ మాట్లాడుతూ తవ్వకాలు జరిపిన గుర్తు తెలియని దుండగులను పోలీసులు పట్టుకోవాలని కోరారు.

పిచ్చికుక్క స్వైర విహారం



బాధిత మహిళలను పరామర్శిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 30: నంద్యాలలో ఓ పిచ్చికుక్క ఆదివారం స్వైర విహారం చేసింది. ప్రియాంక నగర్‌లో మనుషులపై విచక్షణా రహితంగా దాడి చేసింది. అక్కడి నుంచి పద్మావతి నగర్, టెక్కె, సరస్వతి నగర్, రెవెన్యూ క్వార్టర్స్‌లో దాదాపు 25 మందిపై దాడి చేసి గాయ పరిచింది. ప్రియాంక నగర్‌కు చెందిన లక్ష్మీదేవికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెతోపాటు మరో ఇద్దరు మహిళలకు తీవ్రంగా గాయాలు కావడంతో నంద్యాల సర్వ జన వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. మరి కొంత మంది ఆసుపత్రిలో ఇంజక్షన్లను వేయించుకుని తిరిగి వెళ్లారు. నంద్యాలలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళలను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మహిళ ఆత్మహత్య

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 30: అనారోగ్యం కారణంగా మంగలి రాంపుల్లమ్మ(38) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో జరిగింది. రాంపుల్లమ్మకు నెల కింద విష పురుగు కాటేసింది. చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం కుదుట పడలేదు. దీనికి తోడు భర్త లక్ష్మీనారాయణ తాగుడుకు బానిసగా మారడంతో జీవితంపై విరక్తి చెంది విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందింది. కేసు నమోదు చేశామని ఏఎస్ఐ గోవిందనాయక్ తెలిపారు.

యువకుడు ..

ఆదోని రూరల్ ఏప్రిల్ 30 : ఆదోని మండలం సంతేకుడ్లూరు గ్రామానికి చెందిన బసవరాజు(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ యువకుడికి రెండు నెలల క్రితం ఆలూరు మండలం హత్తి బెళగల్ గ్రామానికి చెందిన కవితతో వివాహమైంది. రోజు వారి కూలీ పని చేసుకొనే బసవరాజు మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం తన నివాసంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాసవీ నగర్‌లో చోరీ

కర్నూలు, జూన్ 30: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాసవీ నగర్‌లో చోరీ జరిగింది. అనూష అనే మహిళ ఇంట్లో 12 తులాల బంగారు నగలు దొంగలు అపహరించారు. అనూష, ఆమె భర్త అనంతశర్మ శనివారం అర్ధరాత్రి బంధువుకు అనారోగ్యంగా ఉండటంతో ఆసుపత్రికి వెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చి చూస్తే తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో ఉన్న బంగారు నగలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు కోరారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో యూనియన్ నాయకుడు చంద్రహన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఉద్యోగులను ఆప్కాసులో విలీనం చేయాలని, పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాల ని కోరారు. అనంతరం సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష, జిల్లా ఉపాధ్యక్షురాలుగా కళ్యాణి, వెంకటేషులను ఎన్నుకున్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందాలి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూన్ 30: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందిచాలని వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి వెంకట్రామయ్య అన్నారు. ఆదివారం సేవాసప్తాపంలో భాగంగా నగరంలోని కొండారెడ్డి నగర్, భవానీ శంకర ఆలయంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఉచిత సేవలు అందించిన వైద్యులు మోక్షేశ్వరుడు, శ్రీకర్, వాసురెడ్డి, రాజశేఖర్, కె.జి.శరత్‌చంద్ర, పవిత్రారెడ్డి, నరేష్‌లను అభినందించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు ప్రతాపరెడ్డి, నీలి నరసింహ, సందడి మహేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. ఆదివారం కేకే భవన్‌లో పాతబస్తీ కార్యకర్తలతో నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యల పరిష్కార దిశగా పని చేయకపోవడం వల్లే రాజకీ యంగా మట్టికరిచి పోయిందన్నారు. ఈసమావేశంలో నాయకులు రాజశేఖర్, కే.రామక్రిష్ణ, అబ్దుల్‌దేశాయ్ పాల్గొన్నారు.

వైద్యులు ప్రత్యక్ష దైవాలు: మంత్రి టీజీ భరత్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 30: కొవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు అభినందనీయమని, అందుకే వైద్యులను ప్రత్యక్ష దైవాలుగా అభివర్ణిస్తారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని బీ.క్యాంపు ఐఎంఏ భవన్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్స్ డే వేడుకల్లో మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, డీఎంహెచ్‌వో డా.వై.ప్రవీణ్ కుమార్, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.రామచంద్రనాయుడు, డా.ఎస్‌పీ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్నూలు జీజీహెచ్‌లో ఇటీవల తాను ఆకస్మికంగా తనిఖీ చేశానని, ఎన్నో సమస్యలు ఉన్నట్లు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళిబద్ధంగా కృషి చేస్తామన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రం పూర్తిగా అభివృద్ధిలో కుంటుపడిందని, ఐటీ, పారిశ్రామిక రంగాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. నగరంలో ఐఎంఏ భవన్ నిర్మించడంలో టీజీవీ గ్రూప్ భాగస్వామ్యం ఉండడం ఆనం దంగా ఉందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సమాజంలో వైద్యుల పాత్ర మరవలేనిదన్నారు. పేదలకు సేవలు అం దిస్తున్న వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి, పాణ్యం ఎమ్మెల్యేలను వైద్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర నాయకులు డా.బాలమద్దయ్య, డా.శివశంకర్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరుచరిత

శ్లోకాలతో ఆధ్యాత్మికత



చిన్మయ కేంద్రంలో చిన్నారులతో డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), జూన్ 30: నిత్యం భగవంతుని శ్లోకాలు పలకడం వల్ల విద్యార్థుల్లో ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. పూజ్యగురూజీ తేజోమయానంద స్వామిజీ 74వ జన్మదిన వేడుకలు ఆదివారం నగరంలోని చిన్మయ మిషన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.శంకర్‌శర్మ హాజరై మాట్లాడారు. అనంతరం చిన్నారులకు ఆయన ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుపే మానంద సరస్వతి, విజయకుమార్ రెడ్డ, నాగరూరు శ్రీనివాస్, రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

టౌన్ మోడల్ పాఠశాల పూర్వ విద్యార్థుల దాతృత్వం



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

కర్నూలు(కల్చరల్), జూన్ 30: ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాల 1997-98వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం చిదంబరరావు వీధిలోని అన్నపూర్ణమ్మ విద్యార్థి వసతి గృహం సందర్శించి విద్యార్థులకు రూ.21,012లు విలువ గల నోటుబుక్స్, పాఠ్య పుస్తకాలతోపాటు నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిత్రాల నరేంద్ర, శివ, మల్లికార్జున, రజినికాంత్, సలీమ్, రవి, అనిల్, ప్రదీప్, రాము, బాషా, చంద్రశేఖర్, రసూల్, వంశీ పాల్గొన్నారు.

ప్రజ్ఞాశాలి పుట్టపర్తి నారాయణాచార్యులు

కర్నూలు(కల్చరల్), జూన్ 30: తెలుగు భాషకు, తెలుగు కవిత్వానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఘనత పుట్టపర్తి నారాయణాచార్యులకు దక్కుతుందని, ఆయన 14 భాషల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి అని గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర కొనియాడారు. ఆదివారం నగరంలో మద్దూర్ నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో రాయలసీమకు చెందిన మహాకవి 'పుట్టపర్తి నారాయణాచార్యులు - సాహిత్య అవలోకనం' అనే అంశంపై సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పుట్టపర్తి కుమార్తె, విశ్రాంత దూరదర్శన్ ఉన్న తాధికారి పుట్టపర్తి నాగపద్మిని ముఖ్యవక్తగా ప్రసంగించారు. సదస్సులో సాహితీవేత్తలు జేఎస్ఆర్‌కే శర్మ, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, కా.వెం. సుబ్బలక్ష్మమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

'సింగమనేని రచనలు మార్గదర్శకాలు'

కర్నూలు(కల్చరల్), జూన్ 30: ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు సింగమనేని నారాయణ కథలు ఔత్సాహిక రచయితలకు మార్గ దర్శకాలుగా నిలిచిపోతాయని ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలోని సాహిత్యవేదిక సమావేశ హాలులో దివంగత కథా రచయిత సింగమనేని నారాయణ జయంతిని నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కర్నూలు నగర శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో తొలుత సింగమనేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం. హరికిషన్ మాట్లాడుతూ సింగమనేని నారాయణ సీమలోని కరవు పరిస్థితులను, రైతులు కన్నీటి జీవితాలను స్పందిస్తూ అనేక కథలు రాశారని చెప్పా రు. రచయితలు ప్రమోద్ చక్రవర్తి, డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి, దాసరి వెంకట రమణ, మీసాల రఘు, జి. ప్రతాపరెడ్డి సింగమనేని రాసిన వివిధ కథలను విశ్లేషిస్తూ సభలో శ్రోతలను ఆకట్టుకున్నారు.

పోలీసులకు సన్మానం

కర్నూలు, జూన్ 30: సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పని చేసి పోలీసులు పదవీ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. ఆదివారం పదవీ విరమణ పొందిన పోలీసులను ఎస్పీ జి.కృష్ణకాంత్ పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఎస్.బాబున్‌బాషా, కర్నూలు స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ టి.చంద్రశేఖర్, మూడో పట్టణ మహిళా ఎస్ఐ బి.దేవమణి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కే.హేమంత్ కుమార్‌లు పదవి విరమణ పొందారు. వీరు పోలీసు శాఖకు అందించిన సేవలను ఎస్పీ కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, ఆర్ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ మల్లికార్జున, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన

ఓర్వకల్లు, జూన్ 30: మండలంలోని శకునాల, తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మిద్దూరు ఆధ్వర్యంలో త్రైత్ర సిద్దాంత భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. భగవద్గీతలోని పురుషోత్తమ, ప్రాప్తి, యోగం, అధ్యాయం నందు 16 శ్లోకాలలను వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రాఘవేంద్ర, రవి, గోకారి, జగదీష్, సుజాత, హైమావతి పాల్గొన్నారు.

భూముల కబ్జాపై విచారణ చేపట్టండి

ఓర్వకల్లు, జూన్ 30: మండలంలోని శకునాల ప్రాంతంలో సోలార్ పార్కు, పరిసర ప్రాంతాల్లో ఫారెస్టు భూముల్లో హైడర్ ప్రాజెక్టు నిర్మా ణం చేపడుతున్నారని, వాటిపై విచారణ చేపట్టి నివేదికలు బహిరం గంగా విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాణ్యం, ఓర్వకల్లు మండలాల మధ్య నిర్మించిన హైడర్ ప్రాజెక్టు గ్రీన్‌కో కంపెనీ ఆ భూముల్లో వంద ఎకరాల ఫారెస్టు భూములను ఆక్రమించుకుని ప్రాజెక్టులు నిర్మించారని ఆరోపించారు. కార్యక్రమంలో నాగన్న, చంద్ర బాబు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

కర్నూలు(అర్బన్), జూన్ 30: రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని డీసీసీ అధ్యక్షుడు కే. బాబురావు కోరారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తొలకరి చినుకులు పడి రైతులు నాట్లు వేసుకుంటున్నారని, ఇచ్చిన హామీ ప్రకారం రూ. 20 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని, కస్తూర్బా, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, ఉండవల్లి వెంకటన్న, అనంత రత్నం మాదిగ, సయ్యద్ నవీద్, లాజరస్, అమనుల్లా, షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు సన్మానం

కర్నూలు(అర్బన్), జూన్ 30: నగర పాలక సంస్థ కర్నూలు బీ క్యాంపు వాటర్ హౌస్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న కే వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందారు. ఆదివారం జరిగిన సమావేశంలో ట్యాప్ ఇన్‌స్పెక్టర్ మాధవస్వామి మాట్లాడుతూ వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వెంకటేశ్వర్లు, భార్య కే.పద్మావతమ్మను సహచర సిబ్బంది వెంకటేశ్వర్లు, మద్దయ్య, దేవరాజు, చక్రపాణిగౌడు, బాలాజి, చంద్రశేఖర్, రవి, మక్బూల్, రాజు, రమణ సన్మానించారు.

చంద్రబాబు, టీజీ భరత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు, టీజీ భరత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

కర్నూలు(కల్చరల్), జూన్ 30: పేదలకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్టీయార్ భరోసా పింఛన్ రూ.7వేలు ఇస్తున్నందుకు పేద వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. ఆదివారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చిత్రపటానికి ఐక్యవేదిక సభ్యుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు చంద్రశేఖర శర్మ, బోయ నాగన్న, రాముడు, కర్రెమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారం మరువలేనిది



ఎస్ఈ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 30: ఉద్యోగుల సహకారం మరువలేనిదని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ కే.సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం కే.సుబ్రహ్మణ్యం పదవీ విరమణ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సమావేశభవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ.రవీంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణనాయుడు, జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ కే.నాగరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ సుబ్రహ్మణ్యం దంపతులను ఇంజనీర్లు, సహచరులు, కుటుంబసభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఈఈలు హెచ్ సీఈ మద్దన్న, వెంకట ప్రసాద్, రామ్మోహన్, విశ్రాంత ఎస్ఈలు జి.సురేంద్రనాథ్, కేదారీశ్వర రావు, సుబ్బారావు, నాగేంద్ర, పీఏ టు ఎస్ఈ బండారు శ్రీనివాసులు, స్కిల్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ పెంచలప్రసాద్, నంద్యాల డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌పాషా, డీఈఈలు మహేశ్వర రెడ్డి, మల్లికార్జున, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

'నాటకాలను ఆదరించాలి'



జ్యోతి ప్రజల్వన చేస్తున్న జీవీఎం మోహన్ కుమార్ తదితరులు

కర్నూలు(కల్చరల్), జూన్ 30: వినోదాన్ని పంచే నాటకాలు మన సంస్కృతిలో భాగమని, వాటిని యువత ఆదరించాలని రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నెలనెలా సాంఘిక నాటక ప్రదర్శనల్లో భాగంగా హైదరాబాదుకు చెందిన గోవాడ క్రియేషన్ నాటక సంస్థ కళాకారులతో 'భూతకాలం' నాటకం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ముందు ఏర్పాటు చేసిన కళాకారుల సత్కార సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మోహన్‌కుమార్ మాట్లాడుతూ సినిమా రాకముందే నాటకం ప్రధాన వినోద సాధనంగా ఉండేదని అన్నారు. నాటక దర్శకుడు గోవాడ వెంకట్ మాట్లాడారు. కార్యక్రమంలో దర్శకుడు గోవాడ వెంకట్‌తోపాటు, రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ జీవీఎం మోహన్ కుమార్‌లను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన భూతకాలం నాటకం ఆసాంతం ప్రేక్షకులను అలరించింది.

అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి

సి.బెళగల్, జూన్ 30: ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమానికి మండలస్థాయి అధికారుల తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ అనుపమ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లా డుతూ ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమానికి హాజరు కాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఎల్లెల్సీకి జలకళ



నీటితో కళకళలాడుతున్న కాలువ

హాలహర్వి, జూన్ 30: ఎల్లెల్సీ కాలువకు జలకళతో కళకళలాడుతుంది. కర్నూలు జిల్లా ప్రజలకు తాగునీటి కోసం బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బాపురం, చింతకుంట, విరుపాపురం తాగునీటి జలాశయాలకు నీటిని నింపుకుంటున్నారు. జలాశయాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో తాగునీరు కాలువకు వదలడం వల్ల గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలి

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 30: గ్రామీణ ప్రాంతాల నుంచి ఎస్సీ హాస్టళ్లో ఉండేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఎస్సీ సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగ లక్ష్మీదేవి ఆదోని హాస్టళ్లను తనిఖీ చేసేందుకొచ్చిన సందర్భంగా ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల్లో తల్లిదండ్రులు వర్షాభావ పరిస్థితుల వల్ల వలసలు వెళ్తున్నారన్నారు. తమ పిల్లలను ఎక్కువగా హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారని. ఈ ఏడాది చేరేందుకు సీట్లు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హాస్టల్లో చేరకపోతే చదువులు మధ్యలోనే ఆపేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు నాగరాజు, పవన్, మోహన్, ఉదయ్ పాల్గొన్నారు.

పట్టణాన్ని అభివృద్ధి చేయడమే తెలుసు

ఆదోని టౌన్, జూన్ 30: ఓటు బ్యాంకు రాజకీయాలు... తనకు తెలియదని, పట్టణాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేయడం మాత్రమే తెలుసు అని ఎమ్మెలే డాక్టర్ పార్థసారథి అన్నారు. ఆదివారం పట్టన పొలిమేరలోని ముస్లింలకు చెందిన ఈద్గాను ఆయన ముస్లిం నాయకులతో కలిసి సందర్శించారు. పురాతనమైన ఈద్గా పునర్నిర్మాణం కోసం నిధులు విడుదల కాలేదని ముస్లిం నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు.

పింఛన్ల పండుగలో పాల్గొందాం..

కౌతాళం, జూన్30 : ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం నారాచంద్రబాబు నాయుడు జూలై 1న ఎన్టీఆర్ భరోసా పేరిట ప్రతిష్ఠాత్మకంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ అందజేసే పండుగలో పార్టీ శ్రేణులందరూ పాల్గొనాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు ప్యాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం ఉరుకుంద గ్రామంలో క్లస్టర్-2 ఇన్‌చార్జీ కోటేశ్వర్ నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి పింఛన్ దారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అలాంటిది ఏపీ సీఎం నారాచంద్రబాబునాయుడు ఎలాంటి హంగూ హార్బాటం లేకుండా పింఛన్ దారుల ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్ అందజేయడం హర్షణీయమని పేర్కొన్నారు. ఆయన బాటలోనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు నడవాలన్నారు. అంతకుముందు గ్రామంలో వెలసిన ఈరన్నస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, బీసీసెల్ నాయకులు కొట్రేష్‌గౌడు, అమర్‌నాథ్‌రెడ్డి, మండల నాయకులు వెంకటపతిరాజు, టిప్పుసుల్తాన్, కిట్టు లు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం పట్టణంలోని ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్లను అందజేయనున్నారు. అనంతరం మండల కేంద్రమైన నందవరంలోను, మధ్యాహ్నం ఎమ్మిగనూరు మండలంలోని గుడికల్లు గ్రామంలోను, సాయంత్రం 4గంటలకు గోనెగండ్ల గ్రామంలో పింఛన్లను అందజేస్తారు. ఎన్నికల హామీల్లో భాగంగా పింఛన్ లబ్ధిదారులకు చెప్పిన విధంగానే అలవెన్స్‌తో కలుపుకొని పింఛన్లు పెంచి వృద్ధులకు రూ.7వేలు, వికలాంగులకు రూ.6వేల పింఛన్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అందజేయనున్నారు.

నియోజకవర్గంలో నేడు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పర్యటన

పత్తికొండ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటివద్దకే పింఛన్లపంపిణీ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొంటారని పార్టీవర్గాలు తెలిపాయి. స్థానిక కొండగేరిలో ఉదయం 9గంటలకు పింఛన్లపంపిణీలో పాల్గొని అక్కడి నుంచి హోసూరు, మద్దికెర, పెరవలి, జొన్నగిరి, తుగ్గలి గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారు. గతప్రభుత్వం అందించిన రూ 3వేల పింఛన్‌ను రూ 4వేలకు పెంచి ఏప్రిల్ నుంచి అందిస్తామని చంద్రబాబు ఎన్నికలముందు హామీఇచ్చిన విధంగా జీవోజారీ చేసి సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి పింఛన్‌పంపిణీచేయనున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థుల ఆగ్రహం

● వలంటీర్లకు హాజరు వేశాడని ఫిర్యాదు

ఎమ్మిగనూరు రూరల్, జూన్30 : గ్రామంలోని కొంతమంది వలంటీర్లు ఉపాధి పనులకు వెళ్లనప్పటికీ వారి పేర్లను జాబ్‌కార్డుల్లో రాసి హాజరు ఎలా వేస్తారని గ్రామస్థులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీసిన సంఘటన మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై వారం రోజుల నుంచి సోషల్ ఆడిట్ ముమ్మరంగా జరుగుతోంది. ఇందులో భాగంగానే శనివారం ఎర్రకోట గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ అధికారులు విచారణ జరిపి గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన పనులు, జాబ్‌కార్డుల వివరాలు, జాబ్‌కార్డుల్లోని కూలీల పేర్లను సోషల్ ఆడిట్ అధికారులు గ్రామస్థులకు చదివి వినిపించారు. అయితే, జాబ్‌కార్డుల్లో గ్రామంలోని కొంతమంది వలంటీర్లు ఉపాధి పనులకు వెళ్లనప్పటికా వారి పేర్లను జాబ్‌కార్డుల్లో రాసి హాజరు ఎలా వేస్తారని గ్రామస్థులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీశారు. అంతేగాక ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడడమేగాక, జాబ్‌కార్డుదారుల నుంచి కొంత మొత్తాన్ని సైతం వసూలు చేస్తున్నట్లు గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో భారీగా అవినీతి జరిగిందని, గ్రామంలో జరిగిన ఉపాధి పనుల వివరాలను తమకు ఇవ్వాలని గ్రామస్థులు ఘాటుగా సోషల్ అధికారులను అడిగారు. దీంతో వివరాలను ఏపీవోకు, ఉన్నతాధికారులకు అందజేస్తామని, వారు మీకు పూర్తి వివరాలను అందజేస్తారని నచ్చజెప్పారు. అయితే గ్రామ సభలో ఉద్రిక్తత నెలకొనడంతో గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తనయుడు అక్కడికి చేరుకోవడంతో గ్రామంలో జరిగిన పనులపై అధికారులను అడగలేకపోయారు.

ఆలూరులో తాగు నీరు బంద్

● పట్టించుకోని పాలకులు, అధికారులు
● చేతులెత్తేసిన సర్పంచులు
● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వాటర్ మెన్‌లు
● ఇబ్బందుల్లో ప్రజలు

● 16 రోజులు గడుస్తున్నా సరఫరా కాని తాగు నీరు



ఆలూరులో సైకిళ్లకు బిందెలు వేసుకొని నీటిని తెచ్చుకుంటున్న దృశ్యం

ఆలూరు, జూన్ 30: మంత్రులుగా, జిల్లా పరిషత్ చైర్మన్‌లుగా పాలించిన ఆలూరు నియోజకవర్గంలో ప్రజలు ఏళ్ల తరబడి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పరిష్కరించే నాథుడే కరువయ్యారు. దీంతో ప్రజలకు గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు.

● ఆలూరులో 16 రోజులైనా సరఫరా కానీ తాగునీరు

నియోజకవర్గ కేంద్రం ఆలూరులో 16 రోజులకు ఒక్కసారి, అంటే నెలకు రెండు సార్లు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. ఇంతలా సమస్య తీవ్రతరం అవుతున్నా అధికారుల్లో, పాలకుల్లో స్పందన లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

● రిజర్వాయర్లలో నీరు ఉన్నా...

బాపురం రిజర్వాయర్‌లో తాగునీటి కోసం నీటి నిల్వ ఉన్నా.. దీని ద్వారా 26 గ్రామాలకు అదీ నెలకు రెండుసార్లు మాత్రమే నీరు సరఫరా అవుతోంది. వర్షా కాలంలోనూ ఇదే సమస్య షరా మాములుగా వెంటాడుతున్నా అధికారులు, పాలకుల్లో స్పందన లేకపోవడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు.

● చేతులెత్తేసిన సర్పంచులు

తాగునీటి సరఫరా పర్యవేక్షణలో ఆయా గ్రామాల సర్పంచులు చేతులేత్తేస్తున్నారు. పంచాయతీలో నీటి నిర్వహణకు నిధులు లేవని తేల్చి చెబుతుండటంతో ఈ సమస్య మరింత తీవ్రతరంగా మారింది.

● ఇష్టారాజ్యంగా వాటర్‌మెన్‌లు

ఆయా పంచాయతీల్లో నీటి సరఫరా చేసేందుకు గాను నియమించిన వాటర్‌మెన్‌లు ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారు. 17 రోజులైనా నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు, కాలనీవాసులు వాటర్‌మెన్‌లకు ఫోన్లు చేసినా, స్పందించకపోవడం గమనార్హం. విద్యుత్ కోతల కారణంగా పంపింగ్ నిలచి పోయిందని, ఇంకా టైం పడుతుందని సమాధానం ఇస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక బోర్ల వద్ద నుంచి వ్యయ ప్రయాసలతో నీటిని వాడుకునేందుకు తెచ్చుకుంటుండగా.. తాగేందుకు వాటర్ క్యాన్‌లు డబ్బు చెల్లించి కొంటున్నారు.

● సమస్య తీవ్రత పట్టని పాలకులు, అధికారులు

తాగునీటి సమస్యతో జనం అల్లాడి పోతున్నా.. అధికారులు, పాలకులు ఒక్క రోజైనా సమీక్ష నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో నీటి సరఫరాలో ఎవ్వరికి ఇష్టమొచ్చినట్లు వారు వ్యవహరిస్తుండటంతో సమస్య తీవ్రంగా మారినట్లు తెలుస్తోంది. ఇంత జరిగినా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం మాత్రం దొరకడం లేదు. పట్టణంలోనే ఈ సమస్య తీవ్రంగా ఉందంటే, ఇక గ్రామాల్లో పరిస్థితి చెప్పనక్కర్లేదు..

● వేదవతి, ప్రాజెక్టు పూర్తయితేనే..

శాశ్వత తాగు, సాగునీరు సరఫరా అవ్వాలంటే ఆలూరు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తి అవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

వానరాక ట్యాంకర్లతో నీరు



ఆస్పరిలో పత్తి మొలకలకు బిందెలతో నీళ్లు పోస్తున్న రైతులు

ఆస్పరి, జూన్ 30: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పదునైన వర్షం లేక పోవడంతో పత్తి విత్తనాలు నాటుకున్న రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. పది రోజుల కిందట అరకొరగా కురిసిన వర్షానికి నల్లరేగడి పొలాల్లో పత్తి విత్తనాలు నాటుకున్నారు. పత్తి విత్తనాలు నాటిన నాటి నుంచి వర్షం లేకపోవడంతో అరకొరగా కురిసిన వర్షానికి పత్తి విత్తనం మొలక దశకి చేరుకుంది. మొలకలు ఎండిపోతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకెళ్లి పత్తి విత్తనం నాటిన చోట బిందెలతో పొలాన్ని తడుపుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి పంట సాగు చేస్తూ నష్టాలను చవిచూస్తున్నారు. భూమిలో తగినంత తేమశాతం లేక నాటుకున్న విత్తనం మొలక రాక ఎండిపోతోంది. ఆస్పరికి చెందిన కౌలు రైతు బండమీద రంగన్న ఐదు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి విత్తనాలు నాటారు. వర్షం లేక విత్తనం మొలుస్తుందో లేదో అన్న సందిగ్ధంలో పడి ట్యాంకర్ల ద్వారా నేలను తడుపుతున్నారు. ఇప్పటికే రూ.50వేలు పెట్టిన పెట్టుబడి మట్టిపాలు అవుతుందోనని రంగన్న ఆవేద వ్యక్తం చేశారు.

ప్రణాళిక ఉంటే చదువుల్లో విజయం

● డిప్యూటీ ఈవో వెంకటరమణా రెడ్డి



టాపర్లకు ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్న డిప్యూటీ ఈవో

ఆదోని (అగ్రికల్చర్), జూన్ 30: ప్రతి విద్యార్థి ప్రణాళికబద్ధంగా చదువుకుంటే చదువుల్లో విజయం సాధిస్తారని ఆదోని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉజ్వల మిత్రమండలి ఆధ్వర్యంలో డివిజన్‌లో ఈ ఏడాది పదో తరగతిలో అధిక మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ముఖ్యఅతిథులు డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, ఎంఈవో రాజేంద్రప్రసాద్ హాజరై విద్యార్థులకు నగదుతో పాటు, పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయాన్ని వృధా చేసుకోకుండా విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించినప్పుడే రాణిస్తారు అన్నారు. బాగా చదువుకొని ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు. ఉజ్వల మిత్రమండలి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యన్న, ఆర్థిక కార్యదర్శి స్వామినాథ్, పుర్వాధ్యక్షులు ప్రహ్లాద, నాగన్న, వెంకటేష్, భోజ, రమేష్, కేశవ్ హెచ్‌ఎం అలిం సిద్ధికి పాల్గొన్నారు.

నందవరానికి నేడు ఎమ్మెల్యే బీవీ రాక

నందవరం, జూన్ 30: మండల కేంద్రమైన నందవరం గ్రామానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సోమవారం రానున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 7,117 మంది పింఛన్ దారులు ఉన్నారని అందరికి మూడు నెలలది కలుపుకుని రూ 7000 ఇస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హమీలన్ని నెరవేరుస్తున్నారన్నారు. నందవరంలో 3 సచివాలయాల్లో ఎమ్మెల్యే బీవీ పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంస్కృత విద్య మరింత వ్యాప్తి చెందాలి

మంత్రాలయం, జూన్ 30: సంస్కృత విద్యపై భారతదేశ సనాతన ధర్మాలు, సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసే గ్రంథాలలు మరింత వ్యాప్తి చెందాలని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం బెంగుళూరులోని పీఈఎస్ యూనివర్సిటీలో రామచంద్రమఠం పీఠాధిపతి రాఘవేశ్వర భారతి స్వామీజీ రచించిన భావరామవాసతరణ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షించే సంస్కృతి విద్యకు ప్రోత్సాహం రాఘవేంద్రస్వామి మఠం కల్పిస్తుందని పేర్కొన్నారు.

సంక్షిప్తం

జాతీయ రహదారి బాధితులకు అండగా ఉంటా

ఆదోని, జూన్ 30: జాతీయ రహదారి బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యేను కలిసి జాతీయ రహదారిలో భాగంగా తమకు చెందిన ఇల్లు పోతాయని, ఆదుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జాతీయ రహదారి బాధితులకు అండగా ఉంటానని, ఇప్పుడే అధికారులతో ఒకసారి మాట్లాడి ఒక వారంలోపల బాధితులందరినీ కలిపి ఒక సమావేశం ఏర్పాటు చేసి అందరికీ న్యాయం జరిగేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పెద్దహరివాణము ఆదినారాయణ, బాధితులు నాగరాజు, శేషు, రంగస్వామి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం అమ్మకాలపై ఘర్షణ

మంత్రాలయం, జూన్ 30: మాధవరం గ్రామంలో అక్రమ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు విక్రయించడంలో ఇద్దరి వ్యక్తుల మధ్య శనివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. మాధవరం హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపిన వివరాల మేరకు గూర్మింటి రామయ్య కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా.. ఆయనకు పోటీగా బొమ్మిశెట్టి నాగరాజు అమ్మాలని మాట మాట పెరిగింది. దీంతో బొమ్మిశెట్టి నాగరాజు ఇంటికి వెళ్లిన రామయ్య, అతని భార్య వెంకమ్మ, కొడుకులు నరసింహులు నాగరాజు, తమ్ముడు నాగప్ప, మరదలు పద్మావతిపై దాడి చేశారు. నాగరాజుకు, పద్మావతికి గాయాలయ్యాయి. నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు.

ఎంపీఈవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బసవరాజు ఎన్నిక

మంత్రాలయం, జూన్ 30: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రిలో ఎంపీఈవోలుగా పని చేస్తున్న బసవరాజు ఎంపీఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి ముఖ్య సమావేశంలో బసవరాజు ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎంపీఈవోలకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఒక్క రూపాయి జీతం కూడా పెంచకుండా తమ శ్రమను దోపిడీ చేసిందని ఆరోపించారు. కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తమ సమస్యలపట్ల సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఎంపీఈవోలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి తగిన న్యాయం చేస్తుందని టీడీపీ ప్రభుత్వం భరోసా ఇచ్చిందన్నారు. అనంతరం ఎంపీఈవోలు శోభారాణి, రాజేశ్వరి, కవిత, వెంకటేశ్, వాహిద్, ప్రసాద్, మధు, రోహిణి హర్షం వ్యక్తం చేశారు.

శ్రీ మఠం అన్నదానానికి రూ.2.75 లక్షల విరాళం

మంత్రాలయం, జూన్ 30 : రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన జయలక్ష్మి అనే భక్తురాలు రూ.లక్ష, బెంగళూరు కు చెందిన మరో భక్తుడు పాండు రంగారావు రూ.50 వేలు, గుల్బార్గా కు చెందిన శ్రీవత్స కులకర్ణి అనే భక్తుడు రూ. 1.25 లక్షలు రాఘవేంద్రస్వామి అన్న సంతర్పణ కోసం విరాళం ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అన్నదానం కార్యాక్రమానికి రూ.2.75లక్షలు విరాళం ఇచ్చినట్లు తెలిపారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది.

ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి

పత్తకొండ,జూన్30: పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంతో తప్పనిసరి అని పత్తికొండ ఆర్టీసీడిపో మేనేజర్ విఎస్‌ఎండి రఫిక్‌అహ్మద్ అన్నారు. డిపోలో ఉద్యోగిగా, యూనియన్ నాయకుడిగా పనిచేస్తున్న రాజశేఖర్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆదివారం డిపో ఆవరణలో జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో మంచిఉద్యోగిగా యూనియన్‌ను సమర్థవంతంగా నడిపించిన నాయకుడిగా సేవలు అందించారని కొనియాడారు. సిబ్బందితోపాటు ఆయన స్నేహితులు, బంధువులు రాజశేఖర్ దంపతులను సత్కరించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

మద్దికెర, జూన్ 30: రక్తం దానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడినవారమవుతామని ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ రాగిణి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డైరెక్టర్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో గ్రామ సేవా సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 65 మంది రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయడం వల్ల వేరొకరి ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, ఆ రక్తం ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల మనకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. రక్తదానంతో ఎలాంటి రోగాలు కూడా రావన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో పెరవలి గ్రామ సేవా సమితి సభ్యులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రక్తదాతలు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంలోనూ భాగస్వాములు కావాలి

పత్తికొండ టౌన్, జూన్ 30: సమాజంలో ఉపాధ్యాయులకు మంచి గౌరవం ఉందని, అలాంటి ఉపాధ్యాయులు విద్యాబోధనకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యంలో భాగస్వాములు కావాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం రమ్య రిసార్ట్స్‌లో ఎస్టీయూ నాయకులు, పందికోన గ్రామ ప్రభుత్వ పాఠశల ప్రధానోపాధ్యాయులు నారాయణ పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ నారాయణ, ఆయన భారతి విద్యాశాఖలో ఉపాధ్యాయ వృత్తిలో అనేక ఏళ్లుగా విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా అధ్యక్షులు గోకారి, రిటైర్డు వయోజన విద్యా డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జన జాతరను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, జూన్ 30: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో జరిగే జనజాతర సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పులికొండ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్సీ కాలనీలో మారెమ్మ దేవాలయ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జనజాతర కరపత్రాలు విడుదల చేశారు. 30 ఏళ్ల క్రితం మాదిగల సమస్యల సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని, ఇన్నేళ్లుగా ఎన్నో పోరాటాలు సాగించామని గుర్తు చేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిన సందర్భంగా జనజాతర సభను మాదిగ ఉప కులాలు, ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు , రంగస్వామి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.